## క్లుప్తంగా

### క్షయ నివారణకు అవగాహన ర్యాలీ


హుకుంపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

**గోపాలపురం:** క్షయవ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని హుకుంపేట పీహెచ్‌సీ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీవీవీ దుర్గాభవాని మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం మందులు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. వారోత్సవాలు ఫిబ్రవరి 23వ తేదీ వరకూ కొనసాగుతాయన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

### ఉప్పరగూడెంలో ఆర్‌సీఎం చర్చి ప్రారంభం


ఆర్‌సీఎం చర్చిలో ప్రసంగిస్తున్న ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు

**గోపాలపురం:** స్థానిక ఉప్పరగూడెంలో కొత్తగా నిర్మించిన ఆర్‌సీఎం చర్చిని శుక్రవారం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వర్గ వైషమ్యాలు వదిలి శాంతి జీవనం సాగించేందుకు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమం ఫాదర్ విజయప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం విచారణ ఫాదర్ కళ్యాణ్‌కుమార్, ఫాదర్ మోజెష్, పంతగాని వెంకన్న విశ్వాసులు పాల్గొన్నారు.

# శివయ్య సేవకు వేళాయె

- మహాశివరాత్రికి విస్తృత ఏర్పాట్లు
- కొవ్వూరులో పర్యవేక్షించిన ఆర్డీవో మల్లిబాబు


కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో మల్లిబాబు


బ్రాహ్మణగూడెంలో రామలింగేశ్వరస్వామి, అమ్మవార్ల కల్యాణ మూర్తులు


ఉండ్రాజవరం మండలం పాలంగిలో రామలింగేశ్వస్వామి కల్యాణం


నల్లజర్ల మండలం పోతవరంలో ఉమారామలింగేశ్వరస్వామి వారి కల్యాణం

**కొవ్వూరు:** పరమ శివుని సేవకు వేళయ్యింది. శనివారం మహా శివరాత్రి సందర్భంగా తరలి వచ్చే భక్తుల కోసం శైవ క్షేత్రాల వద్ద, స్నాన ఘట్టాల వద్ద ఇప్పటికే విస్తృత ఏర్పాట్లు చేశారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కొవ్వూరు ఆర్డీవో ఎస్.మల్లిబాబు చెప్పారు. పట్టణంలోని గోష్పాద క్షేత్రంలో శివరాత్రి ఏర్పాట్లను డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, ఇతర శాఖల అధికారులతో కలసి శుక్రవారం సాయంత్రం ఆర్డీవో పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సుందరేశ్వరస్వామి ఆలయంలో వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించేటపుడు భక్తులు ప్రమాదాల బారిన పడకుండా స్నానఘట్టంలో రక్షణ వలయంగా పడవలు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ క్షేత్రంలో ఏర్పాటు చేసే ప్రథమ చికిత్స కేంద్రంలో వైద్యులను, మందులను అందుబాటులో ఉంచామన్నారు. స్నానఘట్టాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కొవ్వూరు మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌ను ఆర్డీవో ఆదేశించారు. భక్తులకు తాగునీరు, అవసరమైన ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆశాఖ అధికారులను ఆదేశించారు.

**నిడదవోలు రూరల్:** మండలంలోని కాటకోటేశ్వరంలో ఉమా కాటకూటేశ్వర లింగేశ్వరస్వామి 60వ వార్షికోత్సవ కల్యాణోత్సవాల నిర్వహణకు ఆలయ కమిటీ చైర్మన్ కోసూరి భాస్కరరావు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. కంసాలిపాలెం గ్రామంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి శివ పంచాయతన, రావిమెట్లలోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి, ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. ఆలయాల వద్ద ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందెళ్లు ఏర్పాటు చేశారు. కంసాలిపాలెం శివాలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సమిశ్రగూడెం, పందలపర్రు, విజ్జేశ్వరం గ్రామాల్లో శివరాత్రికి భక్తులు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**చాగల్లు:** స్థానిక రాజరాజేశ్వరి స్వామివారి ఆలయంలో శనివారం తెల్లవారుజాము 3 గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు జరుగుతాయి. అప్పటి నుంచి లింగోద్భవ కాలం వరకూ స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, దీపాలంకరణ సేవ, లక్షపత్రి పూజ, సహస్ర జ్యోతిర్లింగార్చన నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. బ్రాహ్మణగూడెం బాలరామలింగేశ్వరస్వామి ఆలయం, కలవలపల్లి శివాలయం, మార్కొండపాడు ఉమామార్కండేయస్వామి ఆలయం, నందిగంపాడు శివాలయం, చిక్కాల శివాలయాల్లో శివరాత్రి సందర్భంగా ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు.

**ఉండ్రాజవరం:** పాలంగి గ్రామంలోని బాలా త్రిపుర సుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని శుక్రవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. పండితుడు వెంపరాల హరిశర్మ ఆధ్వర్యంలో అర్చకులు మద్దిరాల సుందరీనాథ్, మద్దిరాల సంతోష్ కుమార్ సహకారంతో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, ఆలయ చైర్మన్ దొడ్డా సూర్య నారాయణ, పాలాటి శరత్‌బాబు, సర్పంచ్ బొక్కా శ్రీనివాసు, ఆలయ ఈఓ ఎంవీ రామయ్య పాల్గొన్నారు.

**నల్లజర్ల:** పోతవరం-కవులూరు గ్రామాల మధ్య గల ఉమారామలింగేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఉమామనోహర్ ఆధ్వర్యంలో కురుకూరి రమేష్, ఏలేటి పుల్లేశ్వరరావు దంపతులు పూజలు నిర్వహించారు. వేద పండితులు రామకోటేశ్వర శర్మ, సూరిబాబు, కృష్ణబాబులు కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాపా శ్రీనివాసరావు, మోత్కూరి శ్రీనివాసరావు,శివ పాల్గొన్నారు.

### 60 మంది పోలీసులతో బందోబస్తు

**కొవ్వూరు:** మహా శివరాత్రి సందర్భంగా గోష్పాద క్షేత్రంలో బందో బస్తుకు 60 మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నామని కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ తెలిపారు. అదనంగా ఎస్ఎస్ఎస్, స్కౌట్స్, మహిళా పోలీసులు, ఇతర వలంటీర్లు మరో 60 మందిని వినియోగిస్తున్నామన్నారు. టోల్‌గేట్ జంక్షన్ నుంచి తాళ్లపూడి వరకూ పట్టిసీమ వెళ్లే భక్తులకు, గోష్పాద క్షేత్రానికి తరలి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటామన్నారు.అగ్నిమాపక శాఖ సిబ్బంది పైప్‌లైన్ల ద్వారా గోష్పాద క్షేత్రాన్ని శుక్రవారం శుభ్రం చేశారు. కొవ్వూరు పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్, మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, విద్యుత్ శాఖ డీఈఈ పి.అచ్యుతాచారి, ఏజీఆర్‌బీ ఏఈ సునీల్ బాబు, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

### జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ


అన్నవరప్పాడులో జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ

**పెరవలి:** అన్నవరప్పాడులోని హరిహర క్షేత్రంలో మరో ప్రతిష్ఠను నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య శివాలయం ప్రాంగణంలో జ్యోతిర్లాంగాల ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. దాతల సహకారంతో గ్రామంలో జ్యోతిర్లింగాలను బాజా భజంత్రీలతో ఊరేగించాక ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. ఈ ఆలయంలో గతేడాది స్ఫటిక లింగాన్ని ప్రతిష్ఠించారు. పలు ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు స్ఫటిక లింగాన్ని దర్శించుకుంటున్నారు. ఏడాదిలో మూడు సార్లు మాత్రమే దర్శనం ఇచ్చే స్ఫటిక లింగం ఈ నెల 18న శివరాత్రి సందర్భంగా భక్తులకు కనువింద చేయనుంది.

## 'ఎత్తిపోతల' నిర్వహణకు రైతులు అండగా ఉండాలి

- ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ గిరిజ
- కుమారదేవం, వేగేశ్వరపురం పథకాల పనితీరు పరిశీలన


కుమారదేవం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న కర్రా గిరిజ, ఈఈ అనురాధ తదితరులు

**కొవ్వూరు:** ఆయకట్టు రైతులందరూ పరస్పరం సహకరిస్తేనే ఎత్తిపోతల పథకాల నిర్వహణ సక్రమంగా సాగుతాయని ఏపీ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్ పర్సన్ కర్రా గిరిజ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని కుమారదేవం, వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకాలను శుక్రవారం ఆమె అధికారులతో కలసి పరిశీలించారు. ఈ రెండు ఎత్తిపోతల పథకాల పనితీరు గురించి ఆయకట్టు రైతు సంఘ నాయకులను ఆమె అడిగి తెలుసుకున్నారు. పథకాలను సక్రమంగా నడుపుకోవడానికి రైతులు సకాలంలో నీటి తీరువా చెల్లించి సహకరి ంచాలని సూచించారు. తక్కువ సమయంలో ఎక్కువ ఆయకట్టుకు నీటిని అందించేలా ఎత్తిపోతల పథకాలు రూపుదిద్దుకో వాలన్నారు. పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసుకుంటే సత్ఫలితాలు ఇస్తాయన్నారు.
ఈ ప్రాంతంలో స్కీముల నిర్వహణను పరిశీలించి ప్రభుత్వానికి అవసరమైన సూచనలు, సలహాలు అందించనున్నట్లు గిరిజ తెలిపారు. ఇక్కడి ఎత్తిపోతల పథకాల్లో ఉన్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణ, మరమ్మతుల్లో స్టాండెండ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ స్కీమ్ ద్వారా ఇప్పుడు రైతులను భాగస్వాములను చేస్తున్నామని ఏపీఎస్ఐడీసీ ఈఈ ఎం.అనురాధ పేర్కొన్నారు. రైతుల నుంచి 20 శాతం వాటా సొమ్ము చెల్లిస్తే వారి నుంచి హామీ తీసుకుని మిగిలిన సొమ్ము ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచీ ఎత్తిపోతల పథకాలకు రోజుకు 16 గంటల ఉచిత కరెంటు అందిస్తున్నామన్నారు. కుమారదేవం ఎత్తిపోతల పథకం రైతు సంఘం అధ్యక్షుడు గోలి శ్రీనివాస్, డీఈఈ పి.దుర్గాగురవయ్య, ఏఈఈ ఎ.సురేంద్ర, కుమారదేవం స్కీమ్ డైరెక్టర్‌లు గంధం దేవీ పార్వతి, మారిశెట్టి మంగరాజు, చదలవాడ మహాలక్ష్మి, కోడూరి బులి వెంకట్రావులతో పాటు నున్న నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎదురెదురుగా బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వెంకన్న

**ద్వారకాతిరుమల:** రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మండలంలోని రాళ్లకుంట సెయింట్ గ్జేవియార్ పాఠశాల సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కొమ్మర గ్రామానికి చెందిన మానూరి వెంకన్న ద్వారకాతిరుమల నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళుతున్నాడు. అదే సమయంలో తూర్పు గోదావరి జిల్లా, నల్లజర్ల మండలం, అయ్యవరానికి చెందిన దెయ్యాల అప్పలరాజు స్వగ్రామం నుంచి బైక్‌పై ద్వారకాతిరుమల వెళుతున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి ఈ రెండు బైక్‌లు వేగంగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్ వారికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకన్న పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు చివటం విద్యార్థి సైన్స్ ఎగ్జిబిట్


విద్యార్థి వెంకటేష్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసు

**ఉండ్రాజవరం:** మండలంలోని చివటం ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థి ఎం.వెంకటేష్ రూపొందించిన సైన్స్ నమూనా ప్రదర్శన జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకుంది. రాజమహేంద్రవరంలో బుధ, గురువారాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రదర్శన పర్యావరణం, వాతావరణ మార్పుల విభాగంలో వెంకటేష్ రూపొందించిన డస్ట్ ఇండికేటర్‌ను ప్రదర్శించాడు. ఈ పరికరం ద్వారా మనం నివసించే ప్రాంతాల్లో పొల్యూషన్ శాతం ఎంత ఉందో తెలుసుకోవచ్చు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన వెంకటేష్ నమూనా సైన్స్ పరికరం రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శనకు ఎంపికైందని చివటం పాఠశాల హెచ్‌ఎం కె. శ్రీనివాసు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి వెంకటేష్‌ను, ప్రోత్సహించిన సైన్సు ఉపాధ్యాయిని బి.దుర్గాదేవిని విద్యాకమిటీ చైర్మన్ సాలా దుర్గ, హెచ్‌ఎం శ్రీనివాసు, ఉపాధ్యాయులు అభినందించారు.

### నిడదవోలులో వాటర్ ప్లాంట్ సీజ్

**నిడదవోలు రూరల్:** నిబంధనలు పాటించకుండా పట్టణంలోని రాయిపేటలో అక్రమంగా నిర్వహిస్తున్న శ్రీసూర్య వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేసినట్లు రాజమహేంద్రవరం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ముత్యాలు నాయుడు, తహసీల్దార్ ఎం.గంగరాజు శుక్రవారం తెలిపారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ ఉన్నతాధికారుల ఆదేశాలతో శ్రీసూర్య వాటర్‌ప్లాంట్‌లో తనిఖీలు నిర్వహించగా ప్యాంకింగ్ చేసేందుకు అనుమతి లేకపోవడంతో పాటు వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఎటువంటి లైసెన్సులు పొందలేదని నిర్ధారించినట్లు ఆయన చెప్పారు. ఈ దాడుల్లో జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, డీటీ ఎ.సత్యనారాయణ, ఫుడ్ సేఫ్టీ అధికారి ఎన్.శ్రీజ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వీఆర్వోలు పాల్గొన్నారు.

### జీటీపీఎస్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

**కొవ్వూరు:** సీతంపేటలోని గ్యాస్ టర్బో పవన్ స్టేషన్ (జీటీపీఎస్) మూసివేతతో రోడ్డును పడిన కార్మికులు, ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. తక్షణమే ప్లాంటు తెరిపించి కార్మికులు,ఉద్యోగులకు ఉపాధి కల్పించాలన్నారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతి వల్ల కొందరు ఉద్యోగ భద్రతను కోల్పోయాన్నారు. ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి నక్కా వెంకటరత్నం, కె.సూర్యనారాయణ, చిట్టూరి వెంకటేశ్వరరావు, సి.వెంకట్రావు, వై.రాజు శుక్రవారం కొవ్వూరులో శ్రీమన్నారాయణను కలిశారు.

### భర్త, పిల్లలు కనిపించడం లేదని ఫిర్యాదు

**కొవ్వూరు:** తన భర్త, ఇద్దరు పిల్లలు శుక్రవారం ఉదయం నుంచీ కనిపించడం లేదంటూ పట్టణానికి చెందిన నోముల త్రివేణి అనే మహిళ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నోముల త్రివేణి, రామకృష్ణ దంపతులకు ఆరేళ్ల కుమారుడు యశ్వంత్‌కుమార్, నాలుగేళ్ల కుమార్తె నమ్రిత సంతానం. ఆర్థిక ఇబ్బందుల కారణంగా భార్యాభర్తల మధ్య వివాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో నోముల రామకృష్ణ స్థానిక సద్గురు పాఠశాలలో చదువుతున్న తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఎక్కడికో వెళ్లిపోయాడు. దీనిపై త్రివేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

### వ్యక్తి అదృశ్యంపై కేసు

**కొవ్వూరు:** తన సోదరుడు పసలపూడి వెంకట్రావు ఈ నెల 16 నుంచి కనిపించడం లేదంటూ మండలంలోని పెనకనమెట్టకు చెందిన పసలపూడి వెంకట సుబ్బారావు కొవ్వూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని వేరొకరితో గొడవ పడి భయపడి ఇంటి నుంచి వెళ్లిపోయిన తన సోదరుడు తిరిగి రాలేదని వెంకట సుబ్బారావు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ జి. సతీష్ తెలిపారు.

### అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

**దేవరపల్లి:** కొంత కాలంగా దేవరపల్లిలో రోడ్ల పక్కన గల చెత్త కాగితాలు ఏరుకుంటూ జీవిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెందారు. స్థానిక పెట్రోలు బంకుకు ఎదురుగా గల రోడ్డులో స్థానికులు ఆ పురుషుడి మృతదేహాన్ని గుర్తించారు. మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ సభ్యులకు సమాచారం అందించారు. మానవత సంస్థ సభ్యులు పంచాయతీ సిబ్బంది సహకారంతో ఆ అనాథ మృతదేహానికి శ్మశానవాటికలో ఖననం చేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండలశాఖ అధ్యక్షుడు బండి సూర్యప్రకాశరావు, ఈడ్పుగంటి నాగేశ్వరరావు, శెట్టి లక్ష్మణుడు తదితరులు పాల్గొన్నారు.